# అక్రమ మట్టి తరలింపుపై చర్యలు



**అనంత సాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం బొమ్మ వరం చెరువు నుంచి అక్రమంగా మట్టి తవ్వకం తరలింపుపై డిప్యూటీ తహసి ల్దార్ గిరీష్ చర్యలు చేపట్టారు. పదుల సంఖ్యలో అక్రమంగా మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న డీటీ.. క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చారు. వాహనా లను నిలుపుదల చేపట్టారు. మట్టి మాఫియా, అక్రమార్కులు ఎంతటి వారైనా చట్టపర చర్యలు ఉంటాయని, ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరికలు జారీ చేశారు.


నేటి దినపత్రిక

సూర్య

17 వ వసంతంలోకి

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం | 04 ఆగస్టు 2024 | పేజీలు 8


## జిల్లావ్యాప్తంగా తహసిల్దార్ల బదిలీలు

- కలెక్టరేట్ పరిపాలనాధికారిగా విజయ్ కుమార్
- మొత్తం 54 మందికి స్థాన చలనం
- నెల్లూరు అర్బన్‌కు షఫీ మాలిక్
- నెల్లూరు రూరల్‌కు లాజరస్





**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో పలువురు తహసిల్దా ర్లకు స్థానం చలనం కలిగింది. ఈ మేరకు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల సమ యంలో నెల్లూరు జిల్లాలో పలువురు తహసిల్దార్లను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఎలక్షన్లు ముగిసి దాదాపు రెండు నెలలు గడిచాయి. దీంతో తాహసిల్దార్లను ప్రభుత్వ నియమ నిబంధనలు కనుగొనంగా వారి స్థానా లను మార్చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా టి.విజయ్ కుమార్‌ను నియమించారు. డిహెచ్ సెక్షన్లకు శాంతి కుమార్ సెక్షన్ తహసిల్దారులుగా, ఈఎఫ్ సెక్షన్ తహసిల్దారుగా శ్రీనివాసులు రెడ్డిని, జి సెక్షన్ సుధాకర్‌రావును ప్రభుత్వం నియమించింది. నెల్లూరు అర్బన్ తహసిల్దార్ షఫీమాలిక్, రూరల్ తహసిల్దార్‌గా లాజరస్‌ను నియమించారు.

**కావలి తహసిల్దార్‌గా పి.శ్రావణ్ కుమార్ నియామకం :**

2024 సార్వత్రిక ఎన్నికల ముందు రాష్ట్రంలో జరిగిన మండల రెవెన్యూ అధికారుల బదిలీలలో వచ్చిన వారిని ఎన్నికల అనంతరం వారిని బదిలీ చేయడం జరిగింది. ఆ క్రమంలో కావలి మండల రెవెన్యూ ఆఫీసర్గా పనిచేస్తున్న నగేష్ ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతనంగా బాధ్యతలు పి.శ్రావణ్ కుమార్ (అడహక్ తహసిల్దార్‌గా) నియామకం జరిగింది. 5న సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు సమాచారం.

## వ్యాధులపై పోరాడేందుకు.. సరికొత్త
# ఆవిష్కరణలు రావాలి







- ఎంపీ వేమిరెడ్డి
- ఏపీఎస్ఏ సీవోఎన్ 2024 లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీ
- కొత్త టెక్నాలజీపై ప్రజలను అవగాహన కల్పించడం ముఖ్యం
- నిత్యం నేర్చుకుంటేనే ముందుకు సాగుతాం

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** వ్యాధులపై పోరాడేందుకు సరికొత్త ఆవిష్కరణలు, టెక్నాలజీ అవసరమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. కొత్త టెక్నాలజీతో రోగులను కాపాడేందుకు కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. నెల్లూరు నగరంలోని అనిల్ గార్డెన్స్‌లో శనివారం నిర్వ హించిన అసోసియేషన్ ఆఫ్ పల్మోనాలజిస్ట్ ఆఫ్ సీమాంధ్ర కాన్ఫరెన్స్ (ఏపీఎస్ఏ సీవోఎన్ 2024)కు ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు. ముందుగా జ్యోతిని వెలిగించిన ఎంపీ వేమిరెడ్డి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. 5వ రాష్ట్రస్థాయి సమావేశానికి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కార్యనిర్వాహక కమిటీ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఊపిరితిత్తుల ఆరోగ్యం, దాని సంబంధిత వ్యాధులు మరియు వాటికి చికిత్స చేయడానికి కొత్త టెక్నాలజీపై ప్రజలను అవగాహన కల్పించడానికి ఈ సమా వేశం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి సదస్సులు వైద్య రంగానికి మంచి సపోర్ట్ ఇస్తాయని, కొత్త టెక్నాలజీని పంచు కోవడానికి కూడా సహకరిస్తాయన్నారు. ప్రస్తుతం లంగ్ క్యాన్సర్, ఆస్తమా, న్యుమో నియా, సి ఓ పీడీ ఇటీవల వచ్చిన కోవిడ్– 19 ద్వారా ప్రపంచం సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. కోవిడ్ –19 వల్ల వైద్య వ్యవస్థ ఎలా ఇబ్బందులు పడిందో ప్రతి ఒక్కరికీ తెసుసని, కాబట్టి యువ డాక్టర్లు సరికొత్త చికిత్సా విధానాలను అన్వేషించాలని


-మిగతా 2లో


### ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే..
# టీడీపీ ప్రభుత్వ లక్ష్యం

- అర్హులైన పేదలందరికి పీఎంఎవై-2.0లో ఇళ్లను మంజూరు చేస్తాం
- రాష్ట్రంలో అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు
- రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి





**నెల్లూరు/మనుబోలు, మేజర్‌న్యూస్ :** అర్హత వున్న ప్రతి పేద వాడికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే ఈ ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర గృహ నిర్మాణ ,సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి శ్రీ కొలుసు పార్థ సారథి అన్నారు. శనివారం మధ్యాహ్నం విజయవాడ నుంచి తిరుపతి వెళుతూ మార్గమధ్యలో మనుబోలులో మంత్రి విలేఖర్లతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ద్వారా రాష్ట్రంలో


-మిగతా 2లో


### కన్నతల్లిని గౌరవించండి..
# సైనికుల సేవలను గుర్తించండి

**రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి**



**నెల్లూరు విద్య, మేజర్‌న్యూస్ :** మనకు జన్మనిచ్చి, మన కోసం జీవితాల్ని త్యాగం చేసిన తల్లిదండ్రులను కడదాకా గుర్తుంచుకోవాలని, దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కష్టపడుతున్న సైనికులను గౌరవించుకోవాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి విద్యార్థినులకు ఉద్బోధించారు. శనివారం డీకే బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన.. ప్రభుత్వ సహాయంతోపాటు కళాశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థినులు స్వచ్ఛందంగా పాలు పంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు కళాశాల ప్రిన్సిపాల్, ఇంటర్ బోర్డ్ నెల్లూరు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఈ కళాశాలలో ప్రభుత్వం స్కిల్ హబ్ ఏర్పాటు చేస్తోందని, అడ్మిషన్ల రద్దీ దృష్ట్యా ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో మూడు అదనపు ఇంగ్లీషు మీడియం సెక్షన్లను మంజూరు చేసిందని తెలియజేస్తూ, కళాశాల, హాస్టల్ భవనాలలో అదనపు గదులు నిర్మాణం కోసం సహ కారం అందించాల్సిందిగా ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తూ


-మిగతా 2లో

# పాతజంగాలపల్లిలో ఘనంగా తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం నువ్వురుపాడు సచివాలయ పరిధిలోని పాతజంగాలపల్లి ఎస్‌సి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాలవారోత్సవాల అవగాహనా కార్యక్రమాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.నాగేశ్వరమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపివో పి.సునీలత అతిధిగా పాల్గొన్నారు. గ్రామంలో తల్లిపాల విశిష్టతను అందరికి వివరించేలా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణీలకు సీమంతం కార్యక్రమం వారే నిర్వహించి ప్రోత్సహించారు. తల్లిపాల వలన ప్రయోజనాలను సదస్సుద్వారా సిడిపివో సునీలత అందరికీ తెలియజేసి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో సిడిపివో సునీలత, సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మలతోపాటు వైద్య,ఆరోగ్య సిబ్బంది ఎం.సుభాషిణి, పి.జిలానిబాషా, పద్మ, ఎంఎస్‌కె గౌసియా, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు



ఎం.లక్ష్మీనరసమ్మ, ఎం.పద్మావతి, డి.విజయలక్ష్మి, ఎస్.కవిత, జి.కామేశ్వరి, బి.అమృత, వెంకటసుబ్బమ్మ, ఐ.అంకమ్మ, గర్భిణీలు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కోతుల బెడదకు నివారణ లేదు - జనాల అవస్తులు తొలగడం లేదు





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో అక్కడక్కడా కోతులబెడద తీవ్రంగా ఉండగా జెఆర్‌పేట, కొలగానిసత్రం ప్రాంతాల్లో మరింత తీవ్రంగా ఉంటూ జనాలు ఆందోళనకు గురవుతున్నారు. ఈవిషయమై అరిచిగీపెడుతున్నా అధికారులు ఆలకించడం లేదు. పట్టణంలోకెల్లా అధికంగా ఈప్రాంతంలోనే కోతులు అధి4కంగా ఉంటూ నానా భీభత్సం సృష్టిస్తున్నా పాలకులు, అధికారులు చిన్నపాటిసమస్యలు భావిస్తున్నట్లుగా ఉంది. ఈప్రాంతంలో చింతచెట్లు అధికంగా ఉండడంతో కోతులు పెద్ద సంఖ్యలో ఆ చెట్లపై ఉంటున్నాయి. నిత్యం ఏమాత్రం భయం లేకుండా జనాలున్నా వారిమద్య నుండే పరుగులు తీస్తుండడం, ఇళ్ళలోకి దూరడం, తినుబండారాలు, పండ్లు, కూరగాయలు ఎత్తుకెళ్ళడంతోపాటు మిగతా వస్తువులను చిందర వందర చేస్తుంటాయి. ఈకోతులు ఇళ్ళలో వస్తువులు తదితరాలను తీసుకెళ్ళి నష్టపెడుతుండడం తోపాటు మిద్దెలపైకెక్కి డిష్, టెలిఫోన్‌వైర్లు తెంచి వేస్తూ తీవ్ర నష్టం కల్గిస్తున్నాయి. చిన్నారులు మరింతగా భయపడుతుంటారు. మహిళలు కూడా కోతులు ఇళ్ళలోకి దూరిన సమయంలో భయభ్రాంతులకు గురవుతుంటారు. ఈ కోతులు పగలంతా నానా భీభత్సం సృష్టిస్తున్నాయి. అధికారులేమో ఈపరిస్థితిని చిన్నవిషయంగా భావించి చర్యలు తీసుకోవడంలేదు. జనాలు మాత్రం ప్రతినిత్యం ఏదో ఒకదాన్ని నష్టపోతుండడంతోపాటు ఆదమరిస్తే పైకి దూకుతాయన్న భయాందోళనతో కాలం గడుపుతున్నారు. వెంటనే ఈకోతుల బెడద తప్పించాలని ఈప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే.. టీడీపీ ప్రభుత్వ లక్ష్యం

*(మొదటి పేజీ తరువాయి)*

అర్హులైన పేదలందరికి ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రి కొలుసు పార్థసారధి పేర్కొన్నారు. 2014-19లో ఉన్న ప్రభుత్వ హయంలో ఇళ్లను నిర్మించుకున్న లబ్ధిదారులకు చాలామందికి గత ప్రభుత్వం కక్షపూరితంగా బిల్లులు చెల్లించలేదన్న మంత్రి, అటువంటి వారికి కూడా బిల్లులు మంజూరు చేయాలని ఇటీవల నిర్వహించిన గృహనిర్మాణశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో అసంపూర్తిగా వున్న ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు 100 రోజుల్లో 1.25 లక్షల ఇళ్లను పూర్తిచేయాలనే లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన ఇళ్లను కూడా వచ్చే మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. వచ్చే మార్చితో పిఎంఎవై-1.0 ముగుస్తుందని, అప్పటి నుంచి పిఎంఎవై-2.0 మొదలుకానుందని మంత్రి చెప్పారు. అర్హులైన పేదలందరికి పిఎంఎవై-2.0లో ఇళ్లను మంజూరు చేస్తామని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనలో నెల్లూరు జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారులు బాగా పనిచేస్తూ లక్ష్యాలను సాధిస్తున్నారన్నారు. గృహ నిర్మాణ శాఖలో లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలని కోరారు. గృహనిర్మాణ శాఖలో ఇంజనీర్లు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమానంగా హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగులకు కూడా 62 సంవత్సరాలు వర్తింపచేయాలని మనుబోలులో గృహ నిర్మాణ శాఖ అధికారులు మంత్రిని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈఈ పోస్టులకు అర్హత కలిగిన ఏఈలకు పదోన్నతి కల్పించాలని, ఔట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టులోకి మార్చాలని హౌసింగ్ ఏఈలు, డీఈలు మంత్రి పార్థసారధికి విజ్ఞప్తి చేశారు. 62 సంవత్సరాలు సర్వీస్ పాలసీ విధానం కాబట్టి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది సమస్యలపై ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తో, ఏఈఈలను డీఈ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని హౌసింగ్ ఎండికి ఫోన్‌లో తెలిపారు. తొలుత మనుబోలుకు విచ్చేసిన మంత్రికి గృహనిర్మాణశాఖ పిడి దయాకర్, సమాచార పౌరసంబంధాలశాఖ డీడీ సదారావు, ఆర్డీవో మలోల పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. మంత్రిని కలసిన వారిలో జేఏసీ వర్కింగ్ చైర్మన్ ఎన్‌వీఎం మనోజ్ కుమార్, ఈఈ మాధవరావు, డీఈఈ, ఏఈలు పాల్గొన్నారు.

# బ్లీచింగ్, మలాథియాన్‌కు నోచుకోని ఆత్మకూరు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణం, మున్సిపల్ పరిధిలోని ఇతర గ్రామాలు వర్షాకాలపు సీజన్‌లో కూడా పిడికెడు బ్లీచింగ్‌కు కానీ, కాసింత మలాథియాన్ పిచికారీకికానీ నోచుకోలేదు. గత మాండూస్ తుఫాన్ ప్రభావంతో ఆత్మకూరులో ఓ మోస్తరు వర్షాలు కురిసి రోడ్లు జలమయంకాగా కాలువల్లో బురదమయమై ఉండడం, వర్షాలు ఆగినా చలిగాలులు విపరీ తంగా ఉండడం తెల్సిందే. దాదాపు ఏడాదిన్నర కాలంగా ఆత్మకూరు పట్టణంలో, మున్సిపల్ పరిధిలో బ్లీచింగ్ చల్లిన దాఖలాలు కానీ, దోమలనివారణకు మలాథియాన్ పిచికారి చేసిన దాఖలాలు లేనేలేవు. కనీసం వర్షాకాలంలోనైనా బ్లీచింగ్ చల్లగలరని, దోమల నివారణకు చర్యలు తీసుకోగలరని అందరూ ఆశించారు. కానీ పాలకులు, అధికా రులు ఆయోచనే చేయలేదు. అధికారులు ఏంచేయగలరు, పాలకులు నిర్ణయించాలి, తీర్మానాలు చేయాలి, నిధులు సమకూర్చాలి అని పలువురు వ్యాఖ్యానిస్తుంటారు. ఏదేమైనా రెవిన్యూ డివిజన్ కేంద్రం, మున్సిపల్ కేంద్రం, నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రమైన ఆత్మకూరులో ఏడాదిగా ఈ దుస్థితి అత్యంత విచారకరం కాగా మరి పాలకులు ఏవిధంగా భావిస్తుంటారో అర్థం కావ డం లేదు. వర్షాకాలం కాలువల్లో బురద పేరుకు పోతుండడం, పందులు స్వేరవిహారం చేస్తుండడం, దుర్గంధభరితంగా ఉంటూ దోమలు విపరీతంగా పెచ్చుపెరిగిపోతూ జనాలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ఈదోమల బెడదతోనే తరచూ పట్టణంలో జ్వరాలు తీవ్రంగా సోకుతున్నాయి. అసలు పట్టణంలో మున్సిపాలనలో బ్లీచింగ్ చల్లకపోవడం, దోమలనివారణ మందును పిచికారీ చేయించకపోవడం అంటే అందరికీ ఆశ్చర్యకరంగా, విడ్డూరంగా ఉంటోంది. బ్లీచింగ్ కొనుగోలుకు రెండు, గత ఏడాది కౌన్సిల్ సమావేశంలో తీర్మానం కూడా చేశారు. కానీ ఇప్పటికి ఆబ్లీచింగ్ తెప్పించారో.. లేదో కానీ పట్టణంలో చల్లిన దాఖలాలు లేవు. అక్కడక్కడా పరిశీలిస్తే కొద్దినెలల క్రితం అక్కడక్కడా మొక్కుబడిగా బ్లీచిం గ్ చల్లారని, ఒక్కరోజు దోమల నివారణ మందును పిచికారీ చేయించినట్లుగా ఉందని చెబుతుండగా అత్యధికంగా జనాలు ఆఊసే లేదంటున్నారు. పాలకులకు ఎప్పటికి బుద్ధిపుడుతుందో చూడాల్సి ఉంది.

# వ్యాధులపై పోరాడేందుకు సరికొత్త ఆవిష్కరణలు రావాలి

*(మొదటి పేజీ తరువాయి)*



సూచించారు. ఊపిరితిత్తుల వ్యాధులపై గ్రామీణ ప్రాంతాల్లో అంతగా అవగాహన లేదని, కాబట్టి వారికి అవగాహన కల్పించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కాన్ఫరెన్స్.. గొప్ప ఆవిష్కరణలకు వేదిక అవుతుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సావరిన్‌కు ఆవిష్కరించారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రని అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాటంరెడ్డి రవీం ద్రరెడ్డి, ఏపీఎస్‌ఏ సీవోఎన్ చైర్‌పర్సన్ గౌరీనాథ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిట్టి మల్లికార్జున, డాక్టర్ మౌర్య, డాక్టర్ ప్రేమ్ దీప్, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ కళ్యాణి, సభ్యులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల ప్రాధాన్యతను అందరూ గుర్తించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తల్లిపాల ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను, విశిష్టతను సమాజంలోని మహిళలంతా గుర్తించాలని, తగిన అవగాహన పెంపొందించుకోవాలని ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపివో పి.సునీలత పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలం బి.చిరువెళ్ళ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.కేశవనారాయణమ్మ పర్యవేక్షణలో అంగన్‌వాడీ టీచర్లు ఆధ్వర్యంలో తల్లిపాలవారోత్సవ అవగాహనా సదస్సు నిర్వహించారు. అతిధులుగా సిడిపివో సునీలత పాల్గొన్నారు. జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనాసుజన్ ఆదేశాలతో తమ ప్రాజెక్టు పరిధిలో తల్లిపాల వారోత్సవాలను గురువారం ప్రారంభించి కొనసాగిస్తున్నామని తెలిపారు. తల్లిపాలు బిడ్డలకు ఆరోగ్యవంతం, అమృతం లాంటివన్నారు. ప్రతి గర్భిణీ, బాలింత, మహిళ తల్లిపాల ప్రాధాన్యత పట్ల అవగాహన పెంపొందించుకోవాలని, ఏఆమత్రం అపోహలకు అవకాశం లేకుండా పుట్టిన బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లిపాలనే ఇవ్వాలని సునీలత సూచించారు. పుట్టిన బిడ్డలకు ఒక్కగంటలోపు తల్లిముర్రుపాలు పట్టించడం వలన వారిలో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాల వలన ఉన్న లాభాలను, ప్రయోజనాలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని కళావతి పేర్కొన్నారు. సూపర్‌వైజర్ నారాయణమ్మ మాట్లాడుతూ తల్లపాల ప్రాధాన్యత గురించిన అందరికీ తెలియజేసేలా ప్రతిఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, గ్రామ గ్రామాన, వాడవాడలా ఈ కార్యక్రమం ద్వారా మహిళకు తల్లిపాల విశిష్టతను గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం లీలావతి, ఎంఎస్‌కె జ్యోత్స్న, అంగన్‌వాడీ కార్యకర్తలు దేవసేనమ్మ, కృష్ణకుమారి, దొరసానమ్మ, రత్నమ్మ, శ్రీదేవి, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సహాయకులు, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## కన్నతల్లిని గౌరవించండి సైనికుల సేవలను గుర్తించండి

(మొదటి పేజీ తరువాయి)

వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మధుబాబు, మాజీ మేయర్ భానుశ్రీ, రాష్ట్ర టిడిపి ప్రధాన కార్యదర్శి రాజా నాయుడు, పూర్వ విద్యార్థి సంఘం అధ్యక్షులు జ్యోతి, కార్యదర్శి కాటూరి కుసుమ కుమారి, డాక్టర్ జయలక్ష్మి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కొండయ్యతోపాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులకు ఎమ్మెల్యే, ఇతర అతిధుల ద్వారా ఉచిత పాఠ్య, నోటు పుస్తకాలు, స్కూలు బ్యాగులు అందజేశారు.

# హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** శనివారం విద్యుత్ భవన్‌లో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష రావు ఆదేశాలు సారం హెచ్‌టీ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ రెవిన్యూ, ఇంటర్నల్ ఆడిట్ కోటశేఖర్ రాజ ధర్మజ్ఞాని హాజరయ్యారు. జిల్లాలోని అన్ని డివిజన్ల నుండి వినియోగదారులు పాల్గొన్నారని ఎస్‌ఈ తెలిపారు. ఈ సందర్భంగా ధర్మజ్ఞాని మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 776 హెచ్‌టీ సర్వీసులు ఉన్నాయని, దాదాపు నెలకు 130 కోట్ల రూపాయలు హెచ్‌టీ వినియోగదారులు విద్యుత్ బిల్లుల రూపంలో చెల్లిస్తారని సంస్థ మనుగడకు వారి అవసరం చాలా ఉందని వారు సంస్థకు బ్యాక్ బోన్ లాంటి వారని తెలిపారు. నెల్లూరు జిల్లా ఎస్‌ఈ హెచ్‌టీ వినియోగదారుల కోసం ఒక వాట్సప్ గ్రూప్ కూడ ప్రారంభించడం జరిగిందని మీ సమస్యలను త్వరగా తెలుసుకుని దాని పరిష్కారం కోసమే దీనిని ప్రారంభించారని తెలిపారు. ఇంతమంది వినియోగదారులు రావడం చాలా సంతోషం అని తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులు ఎన్‌ఎల్‌ఆర్ -967 సర్వీసు వారు మాట్లాడుతూ.. వోల్టేజ్ ఫక్చువేషన్ ఉందని సమస్య పరిష్కరించలని కోరారు. ఇంకొక వినియోగదారుడు క్యూబికల్ మీటర్ ఫెయిల్యూర్ అయినప్పుడు దాదాపు 48 వేల రూపాయలు డబ్బులు వసూలు చేసి కొత్త క్యూబికల్ మీటర్ ఏర్పాటు చేస్తున్నారని మేము క్యూబికల్ మీటర్‌కు 48వేల రూపాయలు డీడీ



చెల్లించి మీ ఆఫీసులో ఇవ్వాలంటే టైం ఎక్కువ అవుతుందని అలా కాకుండా ఆ డబ్బులను మా బిల్లు కే కలిపి క్యూబికల్ మీటర్‌ను మార్చే పద్ధతి పెడితే బాగుంటుందని తెలిపారు. దీనిపై ఎస్‌ఈ మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆఫీస్ వారితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎన్‌ఎల్‌ఆర్-2047 అరబిందో నాయుడుపేట వారు మాట్లాడుతూ.. లీజ్ హోల్డర్స్ 3 రేట్లు సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేస్తున్నారని తగ్గించే అవకాశం ఏమైనా ఉందా అని అడిగారు. ఇంకొక వినియోగదారుడు విద్యుత్ అంతరాయం ఏదైనా ఉంటే ముందుగానే తెలపాలని కోరారు. ఇంకొక వినియోగదారుడు ఎన్‌ఎల్‌ఆర్-663 స్టోన్ క్రషర్ మాకు విద్యుత్ వింజమూరు సబ్‌స్టేషన్ నుంచి వస్తుందని అది దూరం ఎక్కువుగా ఉందని అవకాశం ఉంటే మాకు నంది గుంట సబ్ స్టేషన్ నుంచి ఇస్తే బాగుంటుందని కోరారు. మరొక వినియోగదారుడు ఎలక్ట్రిసిటీ డ్యూటీ ఆరు పైసల నుంచి ఇప్పుడు రూపాయి పడుతుందని కొంతమందికి 6 పైసలు పడుతుందని తెలిపారు. కోర్టుకెళ్లిన వారికి మాత్రమే ఆరు పైసలు పడుతుందని మిగతా వారికి రూపాయి పడుతుందని రెగ్యులేటరీ కమిషన్ వారు నిర్ణయం తీసుకున్న తర్వాత దాని ప్రకారం చేస్తామని తెలిపారు. ఇంకొక వినియోగదారుడు ఎఫ్‌పిపి సీఏ చార్జీలు ఎంతవరకు పడతాయని అడగగా ప్రస్తుతానికి 40 పైసలు చార్జ్ చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ విషయంలో ఏ సమస్య ఉన్న హెచ్‌టీ వినియోగదారులు వెంటనే తెలియచేయాలని లేదా వాట్సప్ చేసిన వెంటనే సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. వినియోగదారులకు సంతృప్తికర సేవలు అందచేయడానికి శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పి.మురళీ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్ ఎస్.బాలచంద్ర, జిల్లాలోని ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు సోమశేఖర్ రెడ్డి, ప్రసన్న కుమార్, పరందామయ్య, రాఘవేంద్రం, బెనర్జీ, రమేష్ చౌదరి, నరేంద్ర రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ అశోక్, సురేష్ బాబు పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డకు రక్ష : హెచ్‌ఈఓ వెంకటసుబ్బయ్య




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణంలోని బీసీ కాలనీ అంగన్వాడి సెంటర్ నందు తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలు శనివారంనిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రవిద్యాధికారి కలసపాటి వెంకటసుబ్బయ్య పాల్గొని మాట్లాడుతూ.. తల్లిపాలే బిడ్డకు రక్షా అని తెలిపారు. అనంతరంతల్లులకు, గర్భవతులకు, బాలింతలకు, తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. బిడ్డకు తల్లిపాలు 6 నెలల వరకు ఇచ్చుట వలన బిడ్డకు సంపూర్ణ పోషక విలువలు ఉంటాయని ఆయన తెలియజేశారు. తల్లిపాలలో నీరు, ఖనిజ లవణాల విటమిన్లు, మినరల్స్ తగినంత పోషక ఆహారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తల్లి తన బిడ్డకు పాలిచ్చుట ద్వారా తల్లి బిడ్డల మధ్య మాతృత్వం అనే బంధం ఏర్పడుతుందన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి ప్రతి అంగన్వాడి, ఆరోగ్య కేంద్రాల్లో, మహిళా మండలి కార్యక్రమాలలో గర్భిణీలకు, బాలింతలకు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. తల్లిపాలు తాగిన శిశువులకు, ఇతర పాలు తాగే శిశువుల కన్నా ఎక్కువ తెలివితేటలు కలిగి ఉంటారన్నారు. కాన్పు అయిన వెంటనే బిడ్డకు పాలు పట్టడం, తరచూ పాలు ఇవ్వడం వల్ల తల్లి రొమ్ముకు సంబంధించిన సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. మురుపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని బిడ్డ ఎదుగుదలకు పోషణ అందిస్తుందన్నారు. ఈనెల ఏడవ తేదీ వరకు తల్లిపాలు వారోత్సవాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీడీపీ నాయకుల మృతి బాధాకరం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలో టీడీపీ నాయకులు మృతి చెందడం చాలా బాధాకరమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం సినిమా హాల్ సెంటర్‌లో గల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సింగనపల్లి జాను మండల పరిధిలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు గెట్టి బోయిన శ్రీనివా సులు మృతి బాధాకరమన్నారు. మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామా నికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు శ్రీనివాసులు ఉదయగిరి పట్టణా నికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సింగనపల్లి గాని శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులతో కలసి వారి మృతదేహం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు పార్టీ ఎల్లవేళలా అండగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మట్టి ఖర్చులకు పదివేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓబుల్ రెడ్డి వెంకటేశ్వర్లు నారాయణరెడ్డి గూడూరు వెంకటేశ్వర్లు శ్రీరాములు పాల్గొన్నారు.

# నారాయణలో ఎంబీఏ అడ్మిషన్స్ ప్రారంభం




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ నందు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ఇంజనీరింగ్ కళాశాల డీన్ ధనుంజయ తెలియజేశారు. నెల్లూరు హరనాథపురంలోని కాలేజీలో ఆయన ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. నారాయణ ఎంబీఏ డిపార్ట్‌మెంట్‌లో విభిన్నమైన కార్యక్రమాలతో విద్యాబోధన జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో ఆశక్తిని పెంచేలా ప్రణాళికబద్ధంగా విద్యాభ్యాసం చేస్తున్నట్లు చెప్పారు. ప్రముఖ విద్యాసంస్థలైన సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఎస్వీ యూనివర్శిటీ, బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుంచి అతిథి ఉపన్యాసకులు విచ్చేసి విద్యార్థులకు కావాల్సిన అంశాలపై తెలియజేస్తారన్నారు. విద్యార్థుల అవసరాలకనుగుణంగా వారికి కావాలసిన విషయ పరిజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని అందిస్తామని చెప్పారు. ప్రత్యేకంగా అత్యధిక సంఖ్యలో పీహెచ్‌డీ అర్హత కలిగిన అధ్యాపకులచే విద్యాబోధన ఉంటుందన్నారు. క్రమశిక్షణ, అకాడమిక్ కల్చర్ ప్రాధాన్యత, బుక్స్, మ్యాగజైన్స్ కలిగిన లైబ్రరీ, ఇండస్ట్రీ అనుభవం కలిగిన నిపుణులచే ప్రత్యేక తరగతులు, ఇండస్ట్రీ ఇన్స్టిట్యూట్ మధ్య సంబంధాలు మెరుగుపరచడం, కేస్ స్టడీస్ మీద ప్రత్యేక శ్రద్ధ, బోధన, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా కోర్సులను రూపొందించడం, ఇండస్ట్రియల్ విజిట్స్, సెమినార్లు, వర్క్‌షాప్స్ నిరంతరంగా కొనసాగడం, స్టాక్ మార్కెట్ నిపుణులచే ఎన్‌ఐఎస్‌ఎం, ఎన్‌సీఎఫ్‌ఎం కార్యకలాపాలు, స్టాక్ మార్కెట్ సిములేషన్ గేమ్స్, తదితర అంశాలపై విద్యార్థులకు క్షుణ్ణంగా తెలియజేడం జరుగుతుందని కళాశాల డీన్ ధనుంజయ తెలియజేశారు.

# ఉచిత వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరం : జిల్లా వైద్యశాల సూపర్డెంట్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఉచిత వైద్య శిభిరాలు పేద ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ శేషా రత్నం పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలో ఇటీవల నూతనంగా ప్రారంభించిన అవినాష్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం తమ వైద్యశాల ప్రాంగణంలో ఉచిత మెగా దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపర్నెంట్ డాక్టర్ శేషారత్నం పాల్గొన్నారు. వైద్య శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం వైద్యశాలను ఉచిత మెగా వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషారత్నంను డాక్టర్ అవినాష్ సత్కరించి పూలబొకే అందించారు. డాక్టర్ శేషారత్నం డాక్టర్ సిహెచ్ అవినాష్ గారిని అభినందిస్తూ ఇటువంటి ఉచిత మెగా దంతవైద్య శిబిరం నిర్వహించడం ఎంతో హర్షదాయకమని ఇటువంటి వైద్య శిబిరాల వల్ల పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అందుతుందని ఇటువంటి శిబిరాలు మరింతగా పెట్టాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా తెలిపారు. డాక్టర్ అవినాష్ ప్రభుత్వ దంత వైద్యులుగా తమ వైద్యశాలలోనే కొనసాగుతూ పదవి విరమణ తర్వాత ఈ ప్రాంతంలోని ప్రజలకు తమ వైద్య సేవలు అందించడం సంతోషమన్నారు. ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి డాక్టర్ అవినాష్ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య చికిత్సలు చేసి ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్ అవినాష్ మాట్లాడుతూ.. తమ వైద్యశాల ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం చాలా సంతోషంగా, సంతృప్తిగా ఉందని దీనివల్ల దంత సమస్యలపై అవగాహన, దంతాల పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు.. ప్రభుత్వ దంత వైద్యునిగా 32 సంవత్సరాలుగా పనిచేసిన అనుభవంతో తన సొంత ప్రాంతమైన ఆత్మకూరులోనే తాను వైద్యశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ అవినాష్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో నియోజకవర్గం లోని ఇతర మండలాలలో ప్రతినెలా ఒక ఉచిత మెగా దంత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉచిత మెగా వైద్య శిబిరంలో సుమారు వందమందికి పైగా తమ దంత సమస్యలకు వైద్యం చేయించుకొని ఉచిత మందులు పొందారు.

# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని మాగంటి ముని చౌదరి కోరారు. శనివారం కరుకోలుపాలెం గ్రామంలోని ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల నందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తలమంచి మహేంద్ర సమక్షంలో మాగంటి మనీఫ్ చౌదరి విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, జామెంట్రి బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులని వీరి చదువులే రేపటి సమాజ అభివృద్ధి అని పిల్లలను బాగా చదువుకోవాలని సూచించారు. విద్యార్థులందరూ ఇష్టంతో కష్టపడి చదవాలన్నారు. విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఎలాంటి ఒత్తిడిలకు గురి కాకుండా ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని కోరారు. ఎన్నో కష్టాలను భరించి చదివించిన మన తల్లిదండ్రులకు మనమిచ్చే గొప్ప కానుక అన్నారు. పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించినప్పుడు ఆ తల్లిదండ్రుల ముఖంలో కనిపించే ఆనందానికి అవధులు ఉండవని, పాఠాలు బోధించిన టీచర్లకు, అష్ట కష్టాలు పడి చదివించిన తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకు వచ్చినందుకు గ్రామస్తులు ఎంతో ఆనంద పడతారని అన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరు ఎదుగుదలకు, ఉన్నత స్థానాలకు ఎదగడానికి, మంచి ఉద్యోగాలు చేయడానికి, ఏ రంగంలోనైనా రాణించడానికి చదివే ప్రాధాన్యమని, ప్రతి ఒక్క విద్యార్థి అది దృష్టిలో ఉంచుకొని బాగా చదువుకొని గొప్ప మార్కులు సాధించుకోవాలని విద్యార్థులకు భవిష్యత్‌లో తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు చిమ్మిలి రామ్మూర్తి, మన్నం చంద్రశేఖర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చొరవతో వవ్వేరుకి ఆర్‌టీసీ బస్సు సర్వీసు ప్రారంభం



- 30 ఏళ్ళ తరువాత వవ్వేరు గ్రామానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం
- స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్న వవ్వేరు వాసులు

**కోవూరు, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్యే ప్రశాంతమ్మ సల్లగుండాల ఆ తల్లి దయతో మా ఊరికి బస్సొచ్చిందంటూ గ్రామస్థుల కృతజ్ఞతలు తెలియజేశారు. 30 ఏళ్ళ నుంచి బస్సు సౌకర్యం లేని వవ్వేరు గ్రామంలో ఆర్‌టీసీ బస్సు హారన్ మోగడంతో వవ్వేరు వాసుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. బుచ్చిరెడ్డిపాళెం సమీపంలోని వవ్వేరు గ్రామానికి గత ముప్పై సంవత్సరాలుగా బస్సు సౌకర్యం లేదు. గ్రామస్థుల ఆటోలపై ఆధారపడి రాకపోకలు సాగించేవారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా తమ గ్రామానికి ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించమని వవ్వేరు వవ్వేరు వాసులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి మొరపెట్టుకున్నారు. కోవూరు ఎమ్మెల్యేగా అఖండ విజయం సాధించిన వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఎన్నికల హామీలు ఒక్కోకకటిగా నెరవేర్చే క్రమంలో వవ్వేరు గ్రామానికి బస్సు సౌకర్యం లేని విషయాన్ని ఆర్‌టిసి ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే స్పందించిన రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులు వవ్వేరు నుంచి బుచ్చిరెడ్డిపాళెంబ పట్టణానికి బస్సు సౌకర్యం కల్పించారు. వవ్వేరు టు బుచ్చిరెడ్డిపాళెం పట్టణానికి బస్సు సర్వీసు ప్రారంభమైన నేపథ్యంలో బుచ్చిరెడ్డిపాళెం తెలుగుదేశం పార్టీ రూరల్ మరియు అర్బన్ మండల అధ్యక్షులు బత్తుల హరికృష, ఎంవి శేషయ్య గార్ల ఆధ్వర్యంలో స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. రాజకీయ నాయకుల హామీలు నీటి మీద రాతలుగా మారిన ఈ రోజుల్లో చేసిన ప్రతి హామీ నెరవేర్చే దిశగా ఎమ్మెల్యే పదవికే వన్నె తెస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారి మాట తప్పని పనితీరును వవ్వేరు వాసులు కొనియాడుతున్నారు. నెల్లూరు డిపో-1 మేనేజర్ మురళికి ధన్యవాదాలు తెలిపారు. వవ్వేరు టు బుచ్చిరెడ్డిపాళెం బస్సు సర్వీసు ప్రారంభోత్సవ కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం తెలుగుదేశం పార్టీ రూరల్, అర్బన్ మండల అధ్యక్షులు బత్తుల హరికృష, ఎంవి శేషయ్యలతో పాటు స్థానిక టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ చిరమన ఆంజనేయులు, జొన్నలగడ్డ శివప్రసాద్, రాజేశ్వరమ్మ, బచ్చేభాయ్, హరనాద్, తాల్లస్వామి, ప్రభాకర్, చిరమన వంశి, కంచర్ల మురళి చౌదరి, వెంకటేశ్వర్లు నాయుడు, జొన్నలగడ్డ వరలక్ష్మి, షేక్ షబ్బీర్, షేక్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

# గంధమహెూత్సవంకు ఎంపీ, ఎమ్మెల్యేలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్లో వెలసి ఉన్న శ్రీ శ్రీ హజరత్ క్వాజా షా సయ్యద్ అబ్దుల్ ఖాదర్ ఖాన్ సాహెబ్ ఖాదరి ఔలియా219 గంధ మహెూత్సవానికి శనివారం రాత్రి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌లు పాల్గొని ప్రత్యేక ప్రార్థనల్లో నిర్వహించారు. తొలిత గంధాన్ని మేళతాళాలు పకీరు నడుమ దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అటవీ శాఖ కార్యాలయం నుంచి దర్గాకు గంధాన్ని తీసుకొని వచ్చారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. తమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉదయగిరి అంటే తమ ప్రత్యేక అభిమానం ఉందని తొలిసారిగా గన్నమొత్సవానికి ఆహ్వానించడం సంతోషకరంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో తాను ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తామన్నారు దర్గా అభివృద్ధికి ప్రభుత్వం తరఫునుంచి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. దర్గా అభివృద్ధికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి 5లక్షల రూపాయలు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ లక్ష రూపాయలు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గా కమిటీ చైర్మన్ మన్సూర్ కార్యదర్శి ఖాదర్ భాషా, టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు రియాజ్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంచల బాబు యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న, సందాని, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** బిడ్డకు తల్లిపాలే శ్రేష్టమని అంగనవాడి సూపర్వైజర్ రమణి అన్నారు. మండలంలోని దండిగుంటలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డకు తల్లిపాలు పట్టించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా పుట్టినప్పటినుంచి ఆరు నెలల వరకు తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలను పట్టించాలన్నారు. తల్లిపాలను పట్టించడం వల్ల తల్లులకు నష్టం కలుగుతుందన్న అపోహలు వేడాలని ఆమె కోరారు. ఆరు నెలల తర్వాత తల్లిపాలతోపాటు శిశువుకు పౌష్టికాహారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు గీసిన తల్లి బిడ్డల చిత్రం అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన సీమాంధ్ర ఎమ్మార్పీఎస్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ పరిధిలోని కేఎన్‌ఆర్ స్కూల్లో ఇటీవల గురు మహేంద్ర అనే విద్యార్థి మృతి చెందడంతో ఆ పాఠశాలకు వెళ్లి సంఘటన జరిగిన విధానాన్ని పరిశీలిస్తున్న సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందింటి సుబ్బయ్య మాదిగ, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు బద్దెపూడి రవీంద్ర. సంఘటనలో మృతి చెందిన గురు మహేంద్రా కుటుంబాన్ని మరింత ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కనీసం రక్షణ చర్యలు తీసుకోకుండా స్కూలు భవనాన్ని నిర్మిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలిగిలి చిన్నయ్య, తాటిపర్తి రఘు తదితరులు పాల్గొన్నారు.

## తోడేరు ఎస్టీ కాలనీలో తల్లిపాల వారోత్సవాలు



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని తోడేరు ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ పద్మజ మాట్లాడుతూ.. బిడ్డకు తల్లిపాల ఆవశ్యకత గురించి వివరించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం శ్రేష్ఠమన్నారు. బిడ్డకు కనీసం రెండేళ్ల వచ్చే వరకు తల్లిపాలు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు సులోచన, రమాదేవు, జయలక్ష్మి, కళ్యాణి, కవిత, కొండమ్మ, విమలావతి తదితరులు పాల్గొన్నారు.

## మండల సర్వసభ్య సమావేశం

**కలిగిరి, మేజర్‌న్యూస్ :** కలిగిరి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలో మండల అధ్యక్షులు మెట్టుకురి శిరీష అధ్యక్షతన ఎంపీడీఓ రంగ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు ప్రతి ఒక్కరు ప్రజలకు అందుబాటులో ఉండి అంకితభావంతో ప్రజలకు పనిచేయాలని కోరారు. అదేవిధంగా ప్రజల సమస్యలు ఏవైనా కానీ నా దృష్టికి తీసుకు వచ్చిన సకాలంలో పరిష్కరించేదనని తెలిపారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో మాట్లాడరు. ఈ మూడు నెలల కాలంలో వారి వారి శాఖల పరంగా జరిగిన అభివృద్ధిని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.

# రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని గారి ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ కే.వాణి ఆధ్వర్యంలో శనివారం నెల్లూరు రూరల్ ఎంపీడీవో కార్యాలయం నందు న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వాణి వితంతు పెన్షన్ గురించి వివరించారు. ప్రభుత్వం వారు వితంతువుల కొరకు ఒంటరి మహిళల కొరకు ప్రత్యేక పథకం కింద పెన్షన్ను అమలు చేయుచున్నారు. కావున ఒంటరి మహిళలు వితంతువులు అందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అలా ఆ పథకం కింద చేరింది. సదుపాయం లేని వారు ఎవరైనా ఉంటే మాకు అర్జీ ద్వారా సమర్పిస్తే దాన్ని పరిశీలించి మేము పై అధికారులతో పరిశీలించి మీకు పెన్షన్ అందేటట్లుగా చేస్తామని జడ్జి తెలియజేశారు. ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. న్యాయం దృష్టిలో అందరూ సమానులే న్యాయానికి గొప్ప బీద అన్న తేడా లేదు అందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి ముఖ్యంగా ఏ పౌరుడు ఆర్థిక కారణాల మూలముగా గాని మరీ ఇతర బలహీనతల మూలంగా గాని న్యాయాన్ని పొందే అవకాశాలను కోల్పోకుండా ఉండడం కోసం ఉచిత న్యాయ సహాయం అందించాలని భీద బలహీనవర్గాలకి న్యాయ విధానం అందుబాటులోనికి తేవడం కోసం ఉచిత న్యాయ సహాయాన్ని అందించాలని నిశ్చయించారు. ఫలితంగా 1976వ సంవత్సరంలో భారత రాజ్యాంగానికి అధికరణ 39ఏ జత చేసి బీద బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయసహాయం అందించడం రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతగా నిర్దేశించారని తెలియజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెవి.సాంబశివారెడ్డి, డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ ఆఫీసర్ డి.వసుమతి, ఎంపీడీవో ఆర్ఎం రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నూతన చట్టాలపై అవగాహన సదస్సు




**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్నటువంటి బార్ అసోసియేషన్ కార్యాలయంలో జులై 1వ తేదీ నుంచి నూతనంగా మారిన చట్టాలపై అవగాహన సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని సూచనల మేరకు ఒకటవ అదనపు సివిల్ జడ్జ్ భరద్వాజ్, నెల్లూరు రైల్వే మెజిస్ట్రేట్ వినోద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి లు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జులై 1వ తేదీ నుండి ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత అనే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టినందున ఇప్పటివరకు న్యాయవాదులు అనుసరిస్తున్న చట్టాలకు అనుగుణంగా జరిగినటువంటి మార్పులను తెలుసుకొని రాబోయే రోజుల్లో న్యాయవాదులు తమ వృత్తిని కొనసాగించాలని వివరించారు. ఎన్నో సంవత్సరాలుగా అమలులో ఉన్నటువంటి చట్టాల్లో కొన్ని మార్పులు తీసుకొచ్చి నేడు సమాజం అనుసరిస్తున్న పరిస్థితులు మరియు తప్పు చేసిన వారికి తగిన శిక్షలు విధించాలని నేపథ్యంలో శిక్షలను కఠిన తరం చేశారని, వాటిని త్వరితగతిన అవగాహన చేసుకుని నేరస్థులకు తగిన శిక్ష పడేవిధంగా న్యాయవాదులు దోహదపడాలని సూచించారు. ఈ అవగాహన సదస్సు కార్యక్రమంలో నెల్లూరు జిల్లాలో ఉన్నటువంటి యువ న్యాయవాదులతోపాటు అనేకమంది న్యాయవాదులు పాల్గొనడం చాలా సంతోషకరమైన విషయం అని తెలిపారు. ఈ సదస్సులో నెల్లూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.ఉమామహేశ్వర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సుందరయ్య యాదవ్, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్లకు అన్ని విధాల అండగా ఉంటా..

**కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి**



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో ఏరియా వైద్యశాలను శనివారం కావాలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి అకస్మికంగా తనిఖీ చేశారు. కావలికి తల మానికంగా వైద్యశాలను తీర్చే దిద్దుతామని తెలిపారు. అనుభవం కలిగిన వైద్యులు సిబ్బంది ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో అందిస్తున్న సేవలు బేస్ అని కావలి శాసనసభ్యులు కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం వైద్యశాలలోని అన్ని విభాగాల గదులను పరిసరాలను పరిశీలించారు. వైద్యశాల పరిసరాలతో సహా పరిషత్పరంగా ఉండాలని తెలిపారు డాక్టర్లకు సిబ్బందికి పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. దాదాపు 900 మంది రోగులు ప్రతిరోజు వైద్యశాలకు వస్తుంటారని వారికి



వైద్యశాలపై నమ్మకం ఉంచే విధంగా సిబ్బంది పనితీరు ఉండాలని ఏరియా వైద్యశాలలో పలు సమస్యలు మా దృష్టికి వచ్చాయని అన్నిటిని త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. వైద్యశాలకు అవసరమైన అత్యధిక వైద్య పరికరాలు కొనుగోలుకు కృషి చేస్తామని తెలిపారు. కావలికి తలమానికంగా ఏరియా వైద్యశాలను తీర్చిదిద్దుతామని చిన్నచిన్న సమస్యలను పెద్దవిగా చేసి చూపుతూ వైద్యుల ఆత్మకైర్యాన్ని దెబ్బతీసేలా ఎవరు ప్రవర్తించవద్దని తెలిపారు. నిత్యం సేవ చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్న డాక్టర్లపై దుష్ప్రచారం చేయవద్దని ఎలాంటి సమస్య వచ్చినా వైద్య సిబ్బందికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీఇచ్చారు. వైద్యశాలపై అభివృద్ధి కమిటీ పరిరక్షణ ఉంటుందని వైద్యశాలలో ఏమైనా సమస్యలు ఉంటే అభివృద్ధి కమిటీకి తెలపవచ్చని డాక్టర్లు దైవంతో సమానమని దేవుని తర్వాత దండం పెట్టేది డాక్టర్లకే అని నమ్మకాన్ని ఉమ్ము కాకుండా రోగులకు భరోసాను ధైర్యాన్ని కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సూపర్డెంట్ పి.పద్మావతి ఆర్ఎంఓజి ప్రమీల, నర్సింగ్ సూపర్డెంట్ ప్రసూన, అభివృద్ధి కమిటీ సభ్యులు చెవల రామకృష్ణ, పబ్బా సాయి విట్టల్, ఏటూరి శివకుమార్, ఆత్మకూరి నాగలక్ష్మి, డాక్టర్ బెజవాడ రవికుమార్, ఐఎంఏ కావలి అధ్యక్షులు డాక్టర్ సుబ్బారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ పోతుగంటి అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

## సౌత్ మోపూర్‌లో మెడికల్ క్యాంపు ఏర్పాటు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూర్ గ్రామం లోని శ్రీరామ కాలనీలో శుక్రవారం ఆగస్టు 2వ తేదీన ఆయుష్ డాక్టర్స్ సమక్షంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా సౌత్ మోపూర్ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అర్షద్ హుస్సేన్ మాట్లాడుతూ.. కాలనీలోని పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలని వ్యక్తిగత శుభ్రతపై ప్రత్యేక దృష్టి ఉంచి తగు జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ఆయుష్ డాక్టర్స్ వారు పేషెంట్స్‌ని చూసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాలనే కాదు ప్రపంచాన్ని కూడా చదవాలి

**సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి**



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** ఐదేళ్ల తర్వాత మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని సమాజంపైనా అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా టెక్నాలజీని అవపోసన పెట్టాలని సూచించారు. కష్టపడి చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడం ద్వారా తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని విద్యార్థులకు ఎమ్మెల్యే సోమిరెడ్డి పిలుపునిచ్చారు.

## కావలిలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జనసేన వీర మహిళ కవిత ఆధ్వర్యంలో కావలి ప్రభుత్వ హాస్పటల్ ముందు కావలి మెయిన్ రోడ్ నందు వీర మహిళ కవిత గత 5రోజుల నుండి జనసేన పార్టీ క్రియాశీలక నమోదు డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనసేన పార్టీలో వీర మహిళలకు ప్రత్యేక గౌరవం ఉంది. 100 సభ్యత్వాలు దాటిన కవిత 500 సభ్యత్వాలు నమోదు చేయాలి. గత సంవత్సరం కావాలని నియోజకవర్గంలో క్రియాశీలక సభ్యత్వాలు మూడింతలు రెట్టింపు అయ్యాయని ప్రతి నియోజకవర్గంలో 5000 సభ్యత్వాలు ఉండాలని జిల్లా పర్యవేక్షకులు వేముల పాటు అజయ్ సూచనలతో సభ్యత్వ నమోదు గురించి అవగాహన కల్పించి మైలురాయి దాటాలి. జనసేన పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా 11 లక్షల సభ్యులను కలిగి ఉందని, మద్దతుదారులకు అవగాహన కల్పించి జనసేన పార్టీ క్రియా సభ్యులుగా చేర్చవలసిన బాధ్యత జనసేన వీర మహిళలు నాయకులు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు గునుకుల కిషోర్, వెంకట సుబ్బయ్య, నూనె మల్లికార్జున యాదవ్, జమీర్, నాగరత్నం, శాంతి, కల, హసీనా, తదితర వీర మహిళలు కావలి పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# ఏపీ జెన్కో బూడిద చెరువుకు గండి

- 70 ఎకరాల్లో పంట పొలాలు మునక
- రెండు మండలాల రైతులకు తీవ్ర నష్టం
- పనుల్లో నాణ్యత లేకనే చెరువు తెగింది
- భయాందోళనలో సమీప గ్రామాల ప్రజలు


బూడిద చెరువు తెగిపోగా పంట పొలాల్లో బూడిద

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థ అయినటువంటి దామోదరం సంజీవయ్య ఏపీ జెన్కో బొగ్గు ఆధారత థర్మల్ విద్యుత్ కేంద్రం బూడిద చెరువు తెగింది. ఈ సంఘటన శనివారం సాయంత్రం ఏడు గంటలకు చోటు చేసుకుంది. ప్రాజెక్టు పరిధిలోకి వచ్చేటువంటి రెండో బూడిద చెరువు సమీప గ్రామాలపై పడింది. ఏపీ జెన్కో థర్మల్ విద్యుత్ కేంద్రం యాష్ పాండ్ పైపు లైను దగ్గర్నుంచి బూడిద చెరువు వరకు ఇలాంటి పరిస్థితి నెలకొని ఉంటుంది. యాష్ పాండు కు పడమర వైపున పెద్ద గండి పడడంతో పెద్ద ఎత్తున బూడిద జలాలు పంట పొలాలపై పడిపోయినాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నాణ్యతలేని పనులు చేయడం వల్ల చెరువు తెగిందని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. చుట్టుపక్కల రోడ్లు పంట పొలాలు బూడిదతో నిండుకున్నాయి. దీంతో భూగర్భ జలాలు కలుషితం అయిపోయినాయి. కోట్ల రూపాయలు నిర్మించిన ఈ పనులకు అధికారులు బిల్లులు చెల్లించి లంచాలు తీసుకోవడం వల్లే చెరువు తెగిందని అర్థమవుతుంది.

### వంద ఎకరాల్లో బూడిద నిండుకుంది

ఏపీ జెన్కో యాష్ పాండ్ తెగిపోవడం వల్ల ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండలాల పరిధిలోని సుమారు 100 ఎకరాల్లో బూడిద చేరుకుంది. ఈ నేపథ్యంలో పచ్చని పంట పొలాలు తెల్లగా మారినాయి. సుమారు 30 కోట్ల మేరకు రైతులు నష్టం చూశారు. బూడిద చెరువు వెంబడి ఉన్నటువంటి ఈ పొలాలు నిరుపయోగంగా మారిపోతున్నాయి. తెగిన బూడిద చెరువును ఏపీ జెన్కో ఉన్నతాధికారులు పరిశీలించారు. ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ దగ్గర నుంచి సివిల్ ఇంజనీర్ల వరకు ప్రాంతాన్ని పరిశీలించారు. పెద్ద ఎత్తున బూడిద చెరువు ఈ జలాలు రోడ్డు వరకు ప్రవహించినాయి. ఏదేమైనా ఏపీ జెన్కో ఇంజనీర్ల అవినీతి కారణమని అర్థమవుతుంది.

# నియోజకవర్గంలోని ఆరోగ్య కేంద్రాల్లో సకల వసతులు




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్, వైద్యాధికారులతో సమీక్షించానని ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. ఆరోగ్య కేంద్రాల వారీగా అవసరాలపై ఆరా తీసి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించాన సర్వేపల్లి శాసనసభ్యులు చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం వెంకటాచలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని స్వయంగా పరిశీలించానని, రూ. 4. 33కోట్లతో నిర్మించిన ఈ ఆరోగ్య కేంద్రం భవనాన్ని 2018లో నేనే ప్రారంభించానని, వేలాది మంది ప్రజలు ఈ ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు పొందుతుండటం అభినందనీయమని ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి చెప్పారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా అన్ని వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి వ్యాఖ్యానించారు. వెంకటాచలంతో పాటు పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రాలకు జెనరేటర్లు, వాషింగ్ మిషన్లు, కంప్యూటర్లు, ఆపరేషన్ థియేటర్ లో అవసరమైన లైట్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పానని ఎమ్మెల్యే తెలిపారు. వైద్య సేవలు పొందుతున్న వారి సంఖ్య పెరుగుదలకు అనుగుణంగా వెంకటాచలం సీ. హెచ్. సీకి అదనపు మందుల సరఫరాకు చర్యలు తీసుకుంటామని సర్వేపల్లి ఎమ్మెల్యే చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఏసీల రిపేర్లు, నర్సింగ్ స్టేషన్ల ఏర్పాటు, మరుగుదొడ్ల పార్టీషియన్, స్టాఫ్ వాష్ రూమ్స్ తదితర సమస్యలపైనా ప్రత్యేక దృష్టి పెడతామని ఎమ్మెల్యే సోమిరెడ్డి వెల్లడించారు. త్వరలోనే వెంకటాచలంతో పాటు పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో పోస్టుమార్టం సేవలు ప్రారంభం కాబోతున్నాయని సర్వేపల్లి శాసనసభ్యులు చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం గదుల్లో అవసరమైన పరికరాలు, ఫ్రీజర్లు సమకూర్చేందుకు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చెప్పారు. వెంకటాచలం సామాజిక ఆరోగ్య కేంద్రంలోని మార్చురీ గదికి కనెక్టవిటీ రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. రోగులకు మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని అందిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. ప్రతి ఆరోగ్య కేంద్రానికి అవసరమైన వసతులు కల్పిస్తామని, ప్రజలకు ప్రైవేటుకు దీటుగా సేవలందించడం వైద్యాధికారులు, సిబ్బంది బాధ్యతఅని ఎమ్మెల్యే సోమిరెడ్డి తెలిపారు.

# అవయవదానం అమరత్వానికి సంకేతం : ఆర్ఐఓ



**నెల్లూరు (విద్య), మేజర్‌న్యూస్ :** అవయవదానం ద్వారా మరో మనిషి జీవితంలో వెలుగులు ప్రసాదించవచ్చుని, తద్వారా అమరత్వాన్ని పొందగలమని డీకే బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఇంటర్మీడియట్ బోర్డ్ నెల్లూరు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఏ.శ్రీనివాసులు పేర్కొన్నారు. అవయవదాన దినోత్సవం సందర్భంగా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగాల ఆధ్వర్యంలో కళాశాలలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎన్‌డీసీ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధీర్ కుమార్ అవయవ, టిస్యు దానాలపై సమగ్ర సమాచారాన్ని విద్యార్థి నులకు అందజేశారు. అదేవిధంగా, కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్ఓ డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ.. అవయవ దానానికి పాటించవలసిన పద్ధతులు పరిమితులు వంటి అంశాలపై వివరిస్తూ విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం సిబ్బంది, విద్యార్థినుల చేత అవయవ దాన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ కొండయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కరుణ కుమారి, ప్రసన్న, భారతీ, లెక్చరర్లు డాక్టర్ వెంకటరావు, కృష్ణ తులసి, శ్రీధర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎంసీ ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు సమర్థవంతంగా జరిగేలా చూడాలని మండల విద్యాశాఖ ఎంఈఓ మధుసూదన్ అన్నారు. శనివారం మండల విద్యా వనరుల కేంద్రంలో మండలంలోని ఆయా పాఠశాలల హెడ్మాస్టర్ లతో అనేక అంశాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించడం, ఆన్లైన్ హాజరు, స్టూడెంట్ కిట్లు పంపిణీ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎంఈఓ హేమ సుందర్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చొరవతో బస్సు సౌకర్యం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రత్యేక చొరవతో మామిడిపూడి గ్రామానికి శనివారం ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పడింది. చాలాకాలంగా ఈ గ్రామానికి బస్సు లేకపోవడంతో అధికార పార్టీ నాయకులు, గ్రామస్తులు ఈ సమస్యను ఎమ్మెల్యేకు తెలియజేయడంతో ఆయన స్పందించి పరిష్కరించారు. వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సును ఏర్పాటు చేయించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేడు కృష్ణాష్టమి పోటీలు

**నెల్లూరు (కల్చరల్), మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని మాగుంట లేఔట్ ఇస్కాన్ సిటీ మందిరంలో శ్రీ కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా ఆదివారం చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ప్లే క్లాస్ నుండి పదవ తరగతి వరకు వివిధ కేటగిరీలలో ఈ పోటీ నిర్వహిస్తున్నారని ఫ్యాన్సీ డ్రెస్, భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు, దేవతామూర్తుల డ్రస్సులు, శ్రీకృష్ణ భక్తి గీతాలు, చిత్రలేఖనం, శ్రీ కృష్ణాష్టమి గ్రీటింగ్ కార్డుల తయారీలో పోటీ నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు అందరు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మందిర నిర్వాహకులు డాక్టర్ సుఖదేవస్వామి కోరారు.

## నేడు సాయి దర్బార్ లో మెగా కంటి వైద్య శిబిరం

**నెల్లూరు (కల్చరల్), మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని బాలాజీ నగర్ పద్మావతి నగర్ సాయి దర్బార్ అద్దాల మందిరంలో ఆదివారం చితకంటి వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని మందిర నిర్వాహకులు మధుసాయి ఒక ప్రకటనలో తెలిపారు. మోడ్రన్ ఐ హాస్పిటల్ వారి సౌజన్య సహకారంతో ఈ నేత్ర వైద్య శిబిర నిర్వహిస్తున్నట్లు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శాస్త్ర చికిత్సలు కూడా ఉచితంగా చేయబడుతుందని ఉచిత కళ్ళజోళ్ళు అందజేస్తారని మధుసాయి తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సభ్యులు చేసుకోవాలని ఆయన కోరారు.

## ఇరు వర్గాల మధ్య ఘర్షణ

**విడవలూరు, మేజర్‌న్యూస్ :** పొలం కౌలు విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఘటన మండలంలోని చౌక చర్ల గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు కథనం మేరకు పొలానికి చెందిన కౌలు విషయంలో దళిత గిరిజనుల వర్గాల మధ్య చిన్నపాటి ఘర్షణ జరిగింది దీంతో ఇరు వర్గాలకు చెందిన వారు పోలీసులకు ఫిర్యాదులు చేయగా ఎస్ఐ సాయి ప్రసాద్ శనివారం సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణ వాతావరణం ఉండకూడదని ఇరువర్గాలను హెచ్చరించారు.

# ఆత్మకూరుకు రాని బస్సులతో ప్రయాణీకుల అవస్థలు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు–ముంబాయి రహదారి ఉంది.. బైపాస్‌రోడ్డు ఉంది.. డివిజన్, మున్సిపల్, నియోజకవర్గ కేంద్రంగా ఉంది. అయినా అనేక ఆర్టీసీ బస్సులు పట్టణంలోకి రావు. రెండు దశాబ్దాలకుపైగా పోరాటాలు చేసిన ప్రయాణీకులు, సమావేశాలు నిర్వహించిన నాయకులు, ప్రజాప్రతినిధులు అలసి పోయారు. కానీ ప్రయాణీకుల సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. అగచాట్లు తప్పడం లేదు. అదనపు భారం అనివార్యంగా ఉంది. ఇదంతా నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణ పరిస్థితి. నెల్లూరు–ముంబాయి రహదారికి 3కిలోమీటర్ల దూరంలో ఆత్మకూరు పట్టణం ఉంది. అదే ఈపట్టణానికి రవాణా పరంగా శాపంగా ఉందని సర్వత్రా భావిస్తున్నారు. గతంలో అన్నీ ఆర్టీసీ బస్సులు జాతీయరహదారిపై నెల్లూరుపాళెం కూడలినుండి ఆత్మకూరు పట్టణంలోకి వచ్చి వెళుతుండేవి. వచ్చి వెళ్ళడానికి ఓ 10నిముషాల సమయం పడుతుంది. కానీ కొంతకాలం క్రితం ఇతర జిల్లాలకు చెందిన బస్సులను బైపాస్‌రైడర్లు అంటూ ఆత్మకూరు పట్టణంలోకి రాకుండా నెల్లూరుపాళెం నుండే రాకపోకలు సాగించసాగారు. క్రమీణా ఈజిల్లాలోని ఉదయగిరి, వాకాడు, నెల్లూరు డిపోలకు చెందిన బస్సులు కూడా పట్టణంలోకి రాకుండా నేరుగా నెల్లూరుపాళెం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు చెందిన కర్నూలు, కడప, అనంతపురం, బనగానపల్లి, పుట్టపర్తి, కళ్యాణదుర్గం తదితర డిపోల బస్సులు, ఉదయగిరి, నెల్లూరు, వాకాడు డిపోలకు చెందిన బస్సులన్నీ

## దశాబ్దాలతరబడి పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు పట్టణంలోకి రాకుండా వెళుతుండడంతో ప్రయాణీకులు ఆయా ప్రాంతాలకు వెళ్ళాలంటే నెల్లూరుపాళెంకు చేరుకొని బస్సెక్కాల్సి ఉంది. ఆయా ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణీకులు నెల్లూరుపాళెం వద్ద దిగాల్సి ఉంది. నెల్లూరుపాళెం నుండి 20రూపాయల అదనపుభారం వెచ్చించి ప్రయాసతో ఆటోల్లో ప్రయాణించాల్సి ఉంది. ఇదిలా ఉండగా ఇతర జిల్లాలకు చెందిన బస్సులు రాత్రివేళల్లో, అర్ధరాత్రి, తెల్లవారుజామున నెల్లూరుపాళెంకు వస్తుంటాయి. ఆ సమయంలో దిగే ప్రయాణీకులు తీవ్రంగా ఇబ్బంది పడుతుంటారు. ఎవరైనా దూర ప్రాంతాల నుండి ఆయా బస్సుల్లో వచ్చేవారు ఆసమయంలో ఆటోలు లేక కూడా ఇబ్బంది పడుతుంటారు. అప్పుడప్పుడూ కొందరు విద్యార్థినిలు, ఉద్యోగినిలు ఒంటరిగా వచ్చి అక్కడ దిగుతుంటారు. ఆసమయంలో వారి పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉంటుంది. ఓవైపు ఆటోలకు అదనపు వ్యయం చేయడం, రాత్రివేళ ఆందోళనకు గురవుతుండడం, కనీసం జిల్లాలోని ఉదయగిరి మార్గానికి వెళ్ళాలన్నా ఆటోలో నెల్లూరుపాళెంకు వెళ్ళాల్సి రావడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకుంటోంది. ఈపరిస్థితిని గమనించిన ఆత్మకూరుకు చెందిన ప్రముఖ నాయకుడు అల్లారెడ్డి కృష్ణారెడ్డి రెండు దశాబ్దాలక్రితమే ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళడంతోపాటు సంవత్సరాల తరబడి పోరాటం చేశారు. 2009లో ఆత్మకూరు శాసనసభ్యులుగా ఎన్నికై రాష్ట్ర ఆర్థికశాఖామంత్రిగా వ్యవహరించిన ఆనం రామనారాయణరెడ్డి ఈపరిస్థితిని గమనించి అప్పట్లో ఆర్టీసీ రీజనల్, జోనల్, డివిజన్, డిపో స్థాయి అధికారులతో ఓ ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రయాణీకులను రప్పించి ఇతర జిల్లాల, ఇతర డిపోల బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి రానందున ఎంతగా ఇబ్బంది పడుతున్నారో వివరించారు. సమస్య తీవ్రంగా ఉందని, సత్వరమే చర్యలు తీసుకోవాలని రామనారాయణరెడ్డి ఆదేశించారు. అన్నింటికి సరేసరే అంటూ ఇతర డిపోల అధికారులతో మాట్లాడుతామని, అన్నీ బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి వచ్చివెళ్ళేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారేకానీ అలాంటి చర్యలు లేనేలేవు. కాగా నెల్లూరు–ముంబాయి జాతీయ రహదారిపై అభయాంజనేయస్వామి విగ్రహం వద్దనుండి ఆత్మకూరు పట్టణానికి ఓ బైపాస్ రోడ్డు ఉంది. నెల్లూరు వైపునుండి వచ్చే బస్సులు బైపాస్ రోడ్డుమీదుగా ఆత్మకూరులోకి వచ్చి ఇక్కడ నుండి నెల్లూరుపాళెంకు వెళ్ళే అవకాశం ఉంది. కడపవైపు నుండి వచ్చే వాహనాలు కూడా నెల్లూరుపాళెం నుండి ఆత్మకూరుకు వచ్చి అక్కడనుండి బైపాస్ రోడ్డుమీదుగా జాతీయరహదారిపైకి వెళ్ళవచ్చు. కానీ ఇంతగా ప్రయాణీకులు ఇబ్బంది పడుతున్నా, గతంలో ఆత్మకూరుకు చెందిన పలువురు ప్రజాసంఘాల ప్రతినిధులు ఇక్కడకు విచ్చేసిన రవాణాశాఖామంత్రి పినిపే విశ్వరూప్‌కు ఈవిషయమై వినతిపత్రం సమర్పించినా ఎవరూ స్పందించడం లేదు. గత ఏడాది ఇక్కడకు వచ్చిన రవాణాశాఖామంత్రికి కూడా వినపత్రం ఇచ్చినా ఫలితం లేకపోయింది. ప్రయాణీకులు తీవ్రంగా వ్యవప్రయాసలతో అగచాట్లు పడుతున్నా సంబంధిత అధికారులు ఎందుకు స్పందించడంలేదు అని సర్వత్రా ప్రశ్నిస్తున్నారు. దూరం తగ్గుతుందన్న కారణంగా బస్సులన్నింటిని బైపాస్‌లుగా నడిపితే ప్రభుత్వరంగ సంస్థకు భావ్యమేనా అని కూడా ప్రశ్నిస్తున్నారు.

ఆత్మకూరు పట్టణంలోకి వచ్చి బైపాస్ మార్గంలో వెళితే కేవలం 10నిముషాల సమయం పడుతుంది. అసలు ఉదయగిరి మార్గానికి వెళ్ళాలంటే సాధారణ ప్రజలతోపాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు కూడా తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. ప్రజల అవసరాన్నిబట్టి, అనుకూలతనుబట్టి బస్సులను నడపాల్సిన బాధ్యత ప్రభుత్వరంగ సంస్థ ఆర్టీసీకి లేదా, అదీగాక సంస్థ నేడు ప్రభుత్వసంస్థగా ఉన్నందున మరింత బాధ్యతకాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొన్ని బస్సులన్కైనా నడపాలని కోరుతున్నారు. చెన్నై తదితర ప్రాంతాలనుండి వచ్చే విద్యార్థినిలు, ఉద్యోగినిలు తీవ్ర ఆందోళనకరంగా ప్రయాణాలు చేస్తున్నారు. మరి ఎవరైనా స్పందిస్తారేమో, చర్యలకు పూనుకుంటారేమో చూడాల్సి ఉంది.

# సమాజంలో తల్లిపాల చైతన్యం రావాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తల్లిపాల ప్రాధాన్యతను మహిళలందరూ గుర్తించి అవగాహన పెంపొందించుకొని చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆత్మకూరు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.నాగేశ్వరమ్మ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని బండారుపల్లి ఎస్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వద్ద తల్లిపాల అవగాహనా సదస్సు నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత ఆదేశాలతో నాగేశ్వరమ్మ పర్యవేక్షణలో అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన ఈసదస్సులో ఆమె మాట్లాడుతూ.. తల్లిపాలలో పోషకవిలువల విటమిన్లు ఉంటాయన్నారు. పుట్టిన బిడ్డలకు తల్లిపాలనే ఇస్తే వారు ఆరోగ్యవంతంగా ఉంటారని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. తల్లులు ఎలాంటి అపోహలకు గురి కాకుండా తమ బిడ్డలకు తప్పకుండా తమ పాలనే ఇవ్వాలని, వారు ఆరోగ్యవంతంగా ఉండేలా చూడాలని ఆమె కోరారు. గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లభించే పోషకవిలువల ఆహారాన్ని తీసుకోవాలని, ఇంకా తమకు అందుబాటులోని పౌష్టికాహారం తీసుకుంటే పాలు సమృద్ధిగా ఉంటాయని, తమ బిడ్డలకు తమ పాలనే ఇస్తే ఎంతో ప్రయోజకరమని నాగేశ్వరమ్మ పేర్కొన్నారు. తల్లులు అపోహలతో డబ్బాపాలు బిడ్డలకు ఇచ్చే సనాతన అలవాటును మార్చుకోవాలని, తల్లిపాల విశిష్టతను



తెలుసుకొని అవగాహన పెంపొందించుకోవాలని ఆమె కోరారు. అందరు తల్లులకు అవగాహన కల్పించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వారంరోజుల పాటు అవగాహనా ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నామని, వారోత్సవాలకు సార్ధకత ఉండేలా తల్లులందరూ తమ బిడ్డలకు తమపాలు తప్పకుండా ఇవ్వాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ, వెంకటసుబ్బమ్మ, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు, కిశోరబాలికలు, చిన్నారులు తదితరులు పాల్గన్నారు.

## బిడ్డలకు వ్యాధినిరోధకశక్తి పెంచేంది తల్లిముర్రుపాలు : సీడీపీఓ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పుట్టేబిడ్డలకు తల్లి ముర్రుపాలు అత్యంత ప్రయోజనకరమని, వ్యాధినిరోధకశక్తిని పెంపొందిస్తాయని ఆత్మకూరు ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత పేర్కొన్నారు. తల్లిపాలవారోత్సవాల్లో భాగంగా శనివారం ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్‌కేశవనారాయణమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నెల్లూరుపాళెం, నువ్వురుపాడు, కరటంపాడు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులు, ర్యాలీలు, సీమంతం కార్యక్రమాల్లో ఆమె అతిధిగా పాల్గొన్నారు. అవగాహనా ర్యాలీలు నిర్వహించిన అనంతరం గర్భిణీలకు సీమంతం కార్యక్రమాలు నిర్వహించిన పిదప అవగాహనా సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా సిడిపివో సునీలత ప్రసంగిస్తూ ప్రతిఏటాలాగే ఈదపా కూడా జిల్లా ఐసిడిఎస్ పిడి హేనాసుజన్ ఆదేశాల మేరకు అందరికీ తల్లిపాల ప్రాధాన్యతను గురించి అవగాహన పెంపొందించేలా తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలను తమ ప్రాజెక్టు పరిధిలోని గ్రామగ్రామాన, వాడవాడలా నిర్వహిస్తున్నామన్నారు. బిడ్డపుట్టిన వెంటనే గంటలోపు తల్లి ముర్రుపాలను బిడ్డలకు ఇస్తే ఎంతో ప్రయోజనకరం, రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన బిడ్డలకు ఆరునెలల వరకు తల్లిపాలనే ఇస్తే అత్యంత శ్రేష్ఠం, ఆరోగ్యవంతమని సునీలత పేర్కొన్నారు. తల్లి గర్భిణీసమయంలో తగినంతగా పోషకవిలువల ఆహారం తీసుకుంటే బిడ్డలకు సమృద్ధిగా పాలు లభిస్తాయని పేర్కొన్నారు. తల్లిపాలు బిడ్డలకు అమృతం లాంటివని కూడా ఆమె పేర్కొన్నారు. మహిళలందరూ తప్పకుండా తల్లిపాల ప్రాధాన్యతను గుర్తించి అవగాహన పెంపొందించుకోవాలని, తప్పకుండా పాటించాలని సునీలత కోరారు. తల్లిపాల ప్రాధాన్యత, ఆవశ్యకతలగురించి సూపర్‌వైజర్ నారాయణమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.నాగేశ్వరమ్మ, సర్పంచ్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏ.మస్తానమ్మ, ఎం.వేణుకుమారి, కె.లక్ష్మినారాయణమ్మ, పి.పరమేశ్వరి, లక్ష్మినరసమ్మ, విజయలక్ష్మి, పద్మ, కవిత, వెంకటసుబ్బమ్మ, అంకమ్మ, అమృత, కామేశ్వరి, బి.సామ్రాజ్యం, కె.సురేఖ, నిక్కి, బీబీజాన్, అనసూయ, నిర్మలాకుమారి, విజేత, శారద, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, మహిళలు, కిశోరబాలికలు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు శ్రేష్టం.. బిడ్డకు తల్లిపాలు అనివార్యం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తల్లిపాలు ఎంతో ప్రముఖ్యతకలిగి ఉంటా యని, పుట్టిన బిడ్డలకు తల్లిపాలు అత్యంతావశ్యకమని, ఆరోగ్యకరమని, శ్రేయస్కరమని ఆత్మకూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ పేర్కొ న్నారు. తల్లిపాలవారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లిలో శనివారం సూపర్‌వైజర్ ఎం.రత్నమ్మ పర్యవేక్షణలో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో తల్లిపాల అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సులో రత్నమ్మ ప్రసంగిస్తూ బిడ్డలకు తల్లిపాలు ఎంతో ఆరోగ్యవంతమని, అత్యంత శ్రేష్టమన్నారు. ఈవిషయాన్ని తల్లులందరూ గుర్తించాలని, అందరూ అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. తల్లిపాల ప్రాధాన్యతను వివరించేందుకే ప్రతిఏటా ఆగస్టు 1నుండి 7వతేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, అందరూ తల్లిపాల ప్రాధాన్యత పట్ల అవగాహన పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. బాలింతలు పోషకవిలువల ఆహారం తీసుకొంటే పాలు బిడ్డకు పుష్కలంగా లభిస్తాయన్నారు. తల్లిపాలలో పోషక విలువలు అధికంగా ఉంటాయని, రోగనిరోధకశక్తి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని రత్నమ్మ పేర్కొన్నారు. ప్రతిమహిళ తల్లిపాల విశిష్టతను గుర్తించాలన్నారు. ప్రభుత్వం టేక్‌హోమ్‌రేషన్ విధానంలో అందించే పౌష్టికాహార సరుకులను గర్భిణీలు, బాలింతలు సక్రమంగా వినియోగించుకోవాలని, అలా వినియోగించుకుంటే గర్భిణీ, ఆమెకు పుట్టబోవు బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని రత్నమ్మ పేర్కొన్నారు. గర్భిణీలు సమతుల ఆహారం తీసుకుంటే పాలు పుష్కలంగా ఉంటాయని, బిడ్డలకు సమృద్ధిగా అందుతాయన్నారు. రోజువారీ ఆహారంలోభగాగంగా ఆకుకూరలు, కోడిగ్రుడ్లు, పాలు, 5లీటర్లకు తగ్గకుండేలా నీరు తీసుకుంటే అలాంటి గర్భిణీలు ప్రసవించాక సమృద్ధిగా పాలు లభిస్తాయని రత్నమ్మ పేర్కొన్నారు. తల్లిపాలలో రోగనిరోధకశక్తి ఉంటుందని, బిడ్డకు తొలిటీకాగా ఉపయోగపడతాయని ఆమె వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఓ.శ్రీదేవి, కె.మహలక్ష్మి, టి.పెంచలమ్మ, పి.రాజేశ్వరి, కె.కామాక్షి, అంగన్‌వాడీకేంద్ర సహాయకులు,పలువురు గర్భిణీలు, బాలింతలు,మహిళలు, కిశోరబాలికలు తదితరులు పాల్గన్నారు.

# అభివృద్ధి బాటలో రూరల్ నియోజకవర్గం

▶ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నేడు నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్, శ్రామిక నగర్‌లో షుమారు 33లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్లు, కల్వర్టు పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సామాన్య కుటుంబాలు, పేద కుటుంబాలు అధికంగా నివసించే ప్రాంతాలలో కనీస వసతుల కోసం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఒక జాతరలా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో ఇప్పటి వరకు చేసినదానికంటే మరో పదింతలు అదనంగా చేయవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ మాన్నేపల్లి రఘు, మాజీ మున్సిపల్ చైర్మన్ కూకటి హరిబాబు, అత్తివరపు యనదయ్య, అషిక్ అలి ఖాన్, బత్తల కృష్ణ, పల్నాటి మస్తాన్ నాయుడు, షేక్ జమీర్, షేక్ అస్లాం, విఘ్నేశ్వర రావు, ఓబుల రాజు, శేషయ్య, పెంచలయ్య, మున్న భాయ్, షేక్ ఖాజా, బంగారు రావణయ్య, వెంకయ్య, నాగరాజు, కూకటి వేణు, కూకటి రాజేష్, విజయ్ రెడ్డి, తురక కృష్ణ, అజయ్, సురేష్, ప్రసాద్ నాయుడు, గంగాధర్, మహేష్, మస్తాన్, సురేష్, మనోహర్ లక్ష్మణ్ అయ్యప్ప డిల్లీ మస్తనయ్య, గౌస్ బాషా, మస్తాన్ వలీ, ఖాజా బాబు, యస్థని, కట్ట రావనయ్య, గోరే భాయ్, ఖాదర్ బాషా, రఫీ, కిరణ్, అభిధ సుల్తానా, విజయమ్మ, గుల్జార్ బేగం, రుక్మిణి, లత, షేక్ అరిఫ్, నక్క రాజేశ్వరమ్మ, వసంతమ్మ, పద్మమ్మ, లావణ్య, జనసేన నాయకులు కరీమ్, శ్రీను, రాజా, రాము, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

# ఫోర్జరీ దారులపై చర్యలకు ఆదేశాలు : ఇన్‌చార్జ్ తహసిల్దార్



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగర మండలం బొమ్మవరం మజరా అగ్రహారంలో ఇంటి నివేశ స్థలాల మంజూరులో తాసిల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని పోలీసులకి తెలిపామని డిప్యూటీ తహసిల్దార్ గిరీష్ అన్నారు. శనివారం తహసిల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన పలు విషయాలు వెల్లడించారు. గ్రామంలో గతంలో జగనన్న లేఅవుట్‌లలో ఖాళీగా ఉన్న ప్లాట్లను ఆక్రమిస్తున్నారని గ్రామస్తుల ఫిర్యాదుతో క్షేత్రస్థాయి విచారణ చేపట్టామన్నారు. లబ్ధిదారుల మంజూరు పత్రాలను పరిశీలించామని అందులో ఇద్దరి అనుమతి అనుమానాస్పదంగా ఉండటం గమనించామన్నారు. నిశితంగా పరిశీలించగా రెండు పత్రాలలో కేవలం తపాలా స్టాంపు వేసి తాసిల్దార్ సంతకం ఫోర్జరీ చేసినట్లు గుర్తించామన్నారు. ఈ విషయంపై తాసిల్దార్ ధ్రువీకరణ చేయడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అధికారి సంతకాన్ని ఎవరు ఫోర్జరీ చేశారన్న విషయంపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.

# వైసీపీ నేతపై దాడి చేసి ఇల్లు కూల్చడం దారుణం : జడ్పీటీసీ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** దుత్తలూరు మండలంలోని నందిపాడు సెంటర్కు చెందిన వైసిపి నాయకుడు మండ్ల వెంకటేశ్వర్లు కుటుంబం సభ్యులపై దాడి చేసి ఇళ్లను రేకుల షెడ్లను చెట్లను ఏక్సివేటర్తో సహాయంతో టిడిపి నాయకులు కూల్చివేయడం దారుణమని దుత్తలూరు జడ్పిటిసి లెక్కల లక్ష్మీకాంతమ్మ, మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డిలు పేర్కొన్నారు. శనివారం కూల్చివేసిన ఇళ్లను షెడ్లను చెట్లను పరిశీలించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వెంకటేశ్వర్లు ఆక్రమణ చేసి ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి వారి ద్వారా తదుపరి చర్యలు చేపట్టాలి స్థలం వివాదం కోర్టులో ఉండగా ఇప్పుడు మండలంలోని ఇతర గ్రామాలకు చెందిన చెందిన టీడీపీ నాయకులతో వచ్చి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేసి కట్టడాలను చెట్లను కూల్చివేయడం తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నియోజకవర్గంలో ఏ పార్టీ అధికారంలో ఉన్న ఎన్నడూ ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడలేదన్నారు. ఎమ్మెల్యే ఇలాంటి పనులను ప్రోత్సహించడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కల్వకుంట వెంకటేశ్వర్‌రెడ్డి మాజీ సర్పంచ్ మండ్ల శివ, సీనియర్ నాయకులు లెక్కల మాలకొండ రెడ్డి, ఓబుల్ రెడ్డి, గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి




**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కడనూతల చెరువులో సుమారు 70 ఎకరాల మేరా భూమి ఆక్రమణకు గురైనట్లు స్థానికులు రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి చెరువును కాపాడాలి స్థానికులు అధికారులను కోరారు. ఆక్రమణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్థానికులు తెలిపారు. చెరువు అక్రమనకు గురి అయితే రైతులకు అవసరమయ్యే నీరు పంట పొలాలకు అందక పొలాలు బీడులు బారే అవకాశం ఎంతైనా ఉందని తమ చెరువును కాపాడాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

# నిరుపేదకి ఆర్థిక సాయం : హ్యాపీ సేవా సంస్థ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్లో కొంతకాలంగా ఎం.శ్రీనివాసులు అనే నిరుపేద గిరిజన యువకుడు అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నట్లు తెలుసుకున్న హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షులు గని భాష వెంటనే తమసంస్థ సభ్యులతో చర్చించుకొని శనివారం సభ్యులతో శ్రీనివాసులు దగ్గరకు చేరుకొని అతనికి కావలసిన సరుకులతో పాటు కొంత నగదును అందించారు. అనంతరం గనిభాష మాట్లాడుతూ.. హ్యాపీ సేవా సంస్థ పేదలను అన్ని విధాలుగా ఆదుకుంటుందని గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు ఎంతో మంది నిరుపేద గిరిజనులకు అన్నదాన కార్యక్రమం ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవూరు ప్రభయ్య సయ్యద్ నౌషాద్, ఆలీ, ప్రసాద్, బాలకృష్ణ, శీను కుటుంబ సభ్యులు ఉన్నారు.

# సెభాష్ పెయ్యల స్రవంతి




**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయితీ వడ్డిపాళెంలో వారం రోజుల నుండి మాటలు రాని మూగ, మతిస్థిమితం లేక రోడ్ మీద తిరుగుతున్న 35" సం మహిళను జువ్వలదిన్ని సచివాలయం మహిళా పోలీసు పెయ్యల స్రవంతి గుర్తించి ఆమెను హక్కున చేర్చుకొని గ్రామస్తుల సహాయంతో ముంగమూరు భవాని ఎడ్యుకేషనల్ సొసైటి ఆదరణ కేంద్రంలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆదరణ కేంద్రం డైరక్టర్ డాక్టర్ కట్టిపల్లి సింహాద్రి రావు మాట్లాడుతూ.. మహిళా పోలీసు పెయ్యల స్రవంతిని అభినందిస్తున్నానని, తను ఒక మహిళగా రోడ్ మీద తిరుగుతున్న సాటి మహిళను ఆదరించాలనే ఆలోచన గొప్పదని మాటలు రాని ఈ మహిళ సైగలతో తన భర్త ఇబ్బందులు పెట్టినట్లు మెడకింద ఒంటిమీద గాయాలు వున్నట్లు చెబుతుందని, త్వరలో తన వివరాలు తెలుసుకొని తన వారితో కలుపుతానని తెలిపారు.

# శుభ్ దిన్ భోజన్ దాతల దాతృత్వం అభినందనీయం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** శుబ్ దిన్ భోజన్ దాతల దాతృత్వం అభినందనీయమని ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి–2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉదయగిరి దళితవాడ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థుల అభ్యసన పఠన సామర్థ్యాలను, మనబడి మన భవిష్యత్తు పనులను, డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ.. విద్యార్థుల సామర్థ్యాలు వారి తరగతి స్తాయికి తగ్గట్టుగా ఉన్నవని, హ్యాండ్ వాష్ పాయింట్స్ త్వరితగతిన పూర్తి చేయాలని, శనివారం శుభదిన్ భోజన్ కార్యక్రమానికి స్వీట్లు, అరటి పండ్లు చాక్లెట్లు విద్యార్థులకు ఇచ్చిన ఎర్రం శెట్టి శ్రీనివాసరావుని అభినందించారు. శుబ్ దిన్ భోజన్ కార్యక్రమం చాలా మంచి గొప్ప కార్యక్రమమని ఈ కార్యక్రమానికి దాతలు విద్యార్థులకు స్వీట్లు, అరటి పండ్లు ఇవ్వడం వారి దాతృత్వానికి నిదర్శనమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు షేక్ షబ్బీర్, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.